


నకిలీ ఇంటి పట్టాలతో మోసం

ఉప్పరపల్లి వద్ద బోగస్ ఇంటి పట్టాలు అంటగట్టి మోసం చేసిన వ్యక్తులు తమపై దాడులు చేశారని కూలీలు ఆరోపించారు. 8లో



టమాట కిలో రూ.33

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/18.3°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

భక్తిలో తరించి.. శోకం మిగిల్చి!



లారీ కిందకు దూసుకెళ్లిన కారును జేసీబీతో బయటకు తీస్తున్న దృశ్యం








మృతులు శ్రీనివాస్ | షణ్ముఖ | వెంకటేష్ | సంతోష్‌కుమార్ | లక్ష్మీప్రసన్నకుమార్ రెడ్డి | ప్రణవ్‌సాయిరెడ్డి

కుటుంబీకులను ఆదుకోవాలి..

శింగనమల మండలపరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురు కృష్ణ భక్తుల కుటుంబాలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శనివారం జరిగిన ఈ ఘటనపై ఆయన కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నిత్యం ఆధ్యాత్మిక సేవలో ఉండే వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రోడ్డు ప్రమాదంలో ఒకేసారి ఆరుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.



హే భగవాన్..!

- కృష్ణ భక్తుల విషాద 'గీత'ం
- నాయనపల్లి క్రాస్ వద్ద కారు, లారీ ఢీ
- ఇస్కాన్‌లో సేవ చేస్తున్న ఆరుగురి మృత్యువాత
- సంకీర్తనకు వెళ్లి వస్తుండగా ఘోరం
- గుండెలవిసేలా రోదించిన కుటుంబీకులు, బంధువులు

అనంతపురం/శింగనమల : వారంతా వయసులో చిన్నవారే... కానీ భక్తిలో మాత్రం వారికి ఎవరూ సరిలేరు. కృష్ణ భగవానుని సేవకు తమ జీవితాన్ని అంకితం చేశారు. స్వామిని కీర్తిస్తూ నిత్యం ఆధ్యాత్మిక సాగరంలో మునిగిపోయేవారు. అలా కృష్ణ భగవానుడి కీర్తనలో పాల్గొని తిరిగివస్తున్న ఆ భక్తులను ఊహించని రోడ్డు ప్రమాదం కబళించేసింది. కుటుంబీకులు, ఆత్మబంధువులు, శిష్యులు అందరికీ తీరని శోకం మిగిల్చింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ సమీపంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అనంతపురం ఇస్కాన్ సేవకులు ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. అనంతపురంలోని ఇస్కాన్ మందిరంలో నగరానికి చెందిన మాదాలం సంతోష్ కుమార్ (34), గల్లి వెంకటేష్ (24), యాగంటి లక్ష్మీ ప్రసన్న కుమార్‌రెడ్డి (34), కర్ణ ప్రణీత్ ప్రణవ్ సాయి రెడ్డి (13), శ్రీసత్యసాయి జిల్లా సీకేపల్లి మండలం హరియాన్ చెరువుకు చెందిన బొలగొండ శ్రీనివాస్ అలియాస్ శ్రీధర్ (26), శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహడపల్లికి చెందిన బొట్ట షణ్ముఖ (30) పనిచేస్తున్నారు. శనివారం ఉదయం వీరంతా తాడిపత్రి పట్టణంలోని శ్రీవాణి స్కూల్‌లో 'దామోదరం' అనే కార్యక్రమం నిర్వహించడానికి అనంతపురం నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని అదే కారులో అనంతపురానికి తిరుగు పయనమయ్యారు. నాయనపల్లి క్రాస్ సమీపంలోకి రాగానే కారు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘోర ప్రమాదంలో కారులోని ఆరుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి.

మిన్నంటిన ఆర్తనాదాలు..

ప్రమాద వార్తను తెలుసుకున్న వెంటనే కుటుంబీకులు హుటాహుటిన సంఘటనాస్థలానికి తరలి వచ్చారు. విగతజీవులుగా పడి ఉన్న తమ వారిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారన్న వార్త తెలుసుకున్న ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తండ్రి దూరమై దుఃఖంలో ఉన్న వారి బిడ్డలు.. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి కుటుంబీకులు.. ఆప్తమిత్రుడు దూరమై ఆత్మబంధువులు.. గురువును కోల్పోయి శిష్యులు చేసిన రోదనలతో అనంతపురం సర్వజనాస్పత్రి దద్దరిల్లింది. ఒక కుటుంబ సభ్యుడు షాక్‌కు లోనై అక్కడే స్పృహ కోల్పోయాడు.

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదం..

కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా కారు నడపడంతోనే రోడ్డు ప్రమాదం జరిగిందని మృతుడు మాదాలం సంతోష్ కుమార్ తండ్రి మాదాలం గంగాధర్ ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో లక్ష్మీ ప్రసన్నకుమార్‌రెడ్డి డ్రైవింగ్ చేస్తున్నట్లు తెలిసింది.



ప్రణవ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి



సంఘటన స్థలంలో మృతదేహాలపై పడి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బంధువులు

నేడు పోస్టుమార్టం

అనంతపురం మెడికల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురి మృతదేహాలను ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత నివాళులర్పించారు. ఆదివారం ఉదయం 8 గంటలకల్లా పోస్టుమార్టం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ శంకర్ నాయక్ తెలిపారు.



సర్వజనాస్పత్రి మార్చురీ వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు



సొమ్మసిల్లి పడిపోయిన వెంకటేష్ తల్లి

పార్ట్ టైం జాబ్ చేస్తూనే..

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహడపల్లికి చెందిన బొట్టు సాంబమూర్తి కుమారుడు షణ్ముఖ అనంతపురంలో బీటెక్ పూర్తి చేశాడు. విద్యను అభ్యసించడానికి ఇక్కడికి వచ్చిన షణ్ముఖ.. కోర్సు పూర్తి చేసిన అనంతరం ఇస్కాన్ బోధనల వైపు ఆకర్షితుడయ్యాడు. ఇస్కాన్ మందిరంలోనే సేవలు చేసుకుంటూ నగరంలోనే ఉండిపోయాడు. నిత్యం ఇస్కాన్ మందిరంలో పూజలు చేసిన తర్వాత పార్ట్‌టైం ఉద్యోగానికి వెళ్లేవాడు. ఇస్కాన్‌లోనే ఉంటూ సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధం అవుతున్నాడు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. కుమారుడి మరణవార్తను తెలుసుకున్న తల్లిదండ్రులు స్వగ్రామం పహడపల్లి నుంచి అనంతపురం బయలుదేరినట్లు తెలిసింది.

పెళ్లి చేయాలనుకుంటుండగా..

అనంతపురం శివారు నాగిరెడ్డిపల్లికి చెందిన వై. శివశంకర్ రెడ్డి, కృష్ణవేణి మాతాజీ దంపతుల కుమారుడు యాగంటి లక్ష్మీ ప్రసన్న కుమార్ రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. నాలుగు సంవత్సరాలుగా ఇస్కాన్‌లో సేవలు చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి భక్తిభావంతో ఇస్కాన్‌లో భజనల్లో పాల్గొనేవాడు. ప్రసన్నకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు అనుకుంటున్న సమయంలోనే దారుణం జరిగింది. నాగిరెడ్డిపల్లిలో అనురాగం, ఆప్యాయతకు ప్రసన్నకుమార్ రెడ్డి పెట్టింది పేరు. అలాంటి వ్యక్తి మరణించాడని తెలియడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సర్వజనాస్పత్రికి తరలివచ్చారు. ప్రసన్న మంచితనాన్ని గుర్తు చేసుకుని కన్నీరు పెట్టుకున్నారు.

నాన్నా లే...

ప్రమాదంలో మరణించిన మాదాలం సంతోష్ కుమార్‌కు నాలుగు సంవత్సరాల క్రితం ప్రియాంకతో పెళ్లయింది. వీరికి రెండు సంవత్సరాల పాప ఉంది. ఈ క్రమంలో తండ్రి మృతదేహం వద్ద చిన్నారి పడిన వేదన అందరినీ కన్నీరు పెట్టించింది. 'నాన్నా లే' అంటూ ఏడుస్తున్న చిన్నారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. తమ ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో సంతోష కుమార్ తల్లిదండ్రులు కూడా కన్నీరు మున్నీరయ్యారు. 'మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా తండ్రీ' అంటూ గుండెలవిసేలా రోదించారు.

తలలో నాలుక శ్రీధర్

బొలగొండ శ్రీనివాస్ అలియాస్ శ్రీధర్‌ది శ్రీసత్యసాయి జిల్లా సీకేపల్లి మండలం హరియాన్ చెరువు. వీరి కుటుంబం 20 సంవత్సరాల నుంచి అనంతపురం హౌసింగ్‌బోర్డులో ఉంటోంది. ఈ క్రమంలో శ్రీధర్ ఇస్కాన్ మందిరంలో గోశాల సంరక్షకుడిగా ఉంటూ అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. శ్రీధర్ స్వయానా పూజారి. భార్య దివ్య మాత. వీరి కుమారుడు కృష్ణకు ఐదు సంవత్సరాలు. అందరికీ సాయం చేసే గుణం ఉన్న వ్యక్తి. ఇస్కాన్‌లో ఎంతో మంది శిష్యుల్ని తయారు చేశాడు. సంకీర్తనలో దిట్ట. అలాంటి మనిషి దూరం కావడంతో శిష్యులు తల్లడిల్లిపోయారు. ఆత్మబంధువుకు కన్నీటి నివాళులర్పించారు.

వెంకీ రా నాన్నా..

చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మికత మెండుగా ఉన్న గల్లి వెంకటేశ్ అలియాస్ వెంకీ 10 సంవత్సరాలుగా ఇస్కాన్‌లో సేవలు చేస్తున్నాడు. అనంతపురం నగరంలోని కమలానగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, నాగజ్యోతి దంపతుల రెండో కుమారుడు వెంకీ. తల్లిదండ్రులు ఇస్కాన్ భావాలను నమ్మి అందరినీ సన్మార్గం వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే వెంకటేశ్ ఆకస్మాత్తుగా దూరం కావడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. 'వెంకీ రా నాన్నా' అంటూ కుమారుడి మృతదేహం వద్ద శ్రీనివాసులు పడిన వేదన వర్ణనాతీతంగా మారింది.

చిన్న వయసులోనే అందనంత దూరంగా..

అనంతపురంలోని గాంధీ బజార్‌కు చెందిన పెద్దారెడ్డి, మాతాజీ దంపతుల కుమారుడు కర్ణ ప్రణీత్ ప్రణవ్ సాయి రెడ్డి హైదరాబాద్‌లోని స్వామి నారాయణ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల్లో అనంతపురం వచ్చాడు. చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక భావజాలం అధికంగా ఉండే ప్రణవ్ తాడిపత్రిలో సంకీర్తన కార్యక్రమం ఉందని ఇస్కాన్ బృందంతో పాటు వెళ్లాడు. కేవలం 13 సంవత్సరాల వయస్సు గల బిడ్డ అందనంత దూరం కావడంతో బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

రేపు రెండు చోట్ల గ్రీవెన్స్

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రెండు చోట్ల నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి వివరాలను పరిష్కార వేదిక ఇన్‌చార్జ్ వాణిశ్రీ శనివారం తెలియజేశారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి గుంతకల్లు పట్టణంలో నిర్వహించనున్న 'పరిష్కార వేదిక'లో కలెక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పాల్గొంటారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఇక కలెక్టరేట్‌లో అనంతపురం, కళ్యాణదుర్గం డివిజన్లకు సంబంధించి డీఆర్ఓ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని వాణిశ్రీ తెలిపారు.

1 నుంచి పత్తి కొనుగోళ్లు

- గుత్తి, తాడిపత్రి మార్కెట్‌యార్డుల్లో కేంద్రాలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో నవంబర్ ఒకటి నుంచి రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు మొదలు కానున్నట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో గుత్తి, తాడిపత్రి మార్కెట్‌యార్డుల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్వింటా పత్తి రూ.7,121 నుంచి రూ.7,521 ప్రకారం కొనుగోలు చేస్తారన్నారు. రైతులు తాము పండించిన పత్తికి సంబంధించి మొదట శ్యాంపిల్స్ తీసుకెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. 8 నుంచి 12 శాతం లోపు తేమశాతం ఉన్న నాణ్యమైన పత్తి తీసుకెళ్లాలని సూచించారు. తడిసిన, రంగు మారిన సరుకు కొనుగోలు చేయరన్నారు. ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఏపీ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్యారోగ్యశాఖకు సంబంధించి ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2002, రూల్స్ 2007 జిల్లాస్థాయి సలహా కమిటీ, జిల్లా రిజిస్టరింగ్ అథారిటీ కమిటీ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమయం, డాక్టర్ సర్టిఫికెట్ల వివరాలు, గదుల సంఖ్య, పడకలు, వాష్ రూమ్‌లు, ఆస్పత్రికి సంబంధించిన పూర్తి వివరాలు అందులో ఉండాలన్నారు. జిల్లాలోని 528 ఆస్పత్రులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిసే విధంగా ఎక్సెల్ షీట్‌లో నమోదు చేయాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, సిబ్బంది సమష్టిగా కృషి చేసి జిల్లా ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలన్నారు. మహిళలు, శిశువుల వైద్యానికి అధిక ప్రాధాన్య ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. కమిటీకి సంబంధించి ఒక వాట్సాప్ గ్రూప్ తయారు చేసి సూచనలు, సలహాలు ఉంచాలన్నారు. జిల్లాలోని కొన్ని గ్రామాలను ప్రైవేటు ఆస్పత్రుల సంఘం అప్నా, ఐఎంఏ వైద్యులు దత్తత తీసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నపిల్లల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, ఐఎంఏ అధ్యక్షుడు మురళీకృష్ణ, అప్నా అధ్యక్షుడు విజయకుమార్, వైద్యులు థామస్‌రెడ్డి, శ్రీనాథ్, ఆర్‌డీటీ హెల్త్ డైరెక్టర్ రవిప్రసాద్, న్యాయ సలహాదారు రామ్‌కుమార్, వినియోగదారుల ఫోరం కృష్ణమూర్తి, ఎన్‌జీఓ భానుజా, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు షాకుంబీ, ఉపాధ్యక్షురాలు రాధమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బావిలో పడి ఉపాధ్యాయుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: బావిలో పడి ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన కళ్యాణదుర్గం పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం పట్టణంలోని సరోజ కాంపౌడ్ కాలనీలో ఉపాధ్యాయుడు గోవిందురాజులు తన భార్య రమణమ్మతో కలిసి ఉంటున్నారు. వీరికి కీర్తన, వినయ్ సంతానం. శెట్టూరు ఉన్నత పాఠశాలలో గోవిందురాజులు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే బయటికి వెళ్లారు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు తెలిసిన వారు, చుట్టుపక్కల ఇళ్లలో ఆరా తీసినా ఫలితం కానరాలేదు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం మల్లాపురం రోడ్డులోని గ్యాస్ గోడౌన్ సమీపంలో ఉన్న బావిలో మృతదేహం తేలియాడుతుండటం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి పరిశీలించి, మృతదేహం వద్ద ఉన్న ఆధారాలను బట్టి గోవిందరాజులుగా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. గోవిందరాజులుకు నిత్యం ధ్యానం చేసే అలవాటు ఉందని, ఈ క్రమంలోనే బావి సమీపంలో ధ్యానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలు జారి అందులో పడి మృతి చెందినట్లు వెల్లడైంది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



గోవిందరాజులు (ఫైల్)

క్లుప్తంగా

సాగు, తాగునీటికి ఢోకా లేదు



గేజ్‌ను పరిశీలిస్తున్న డ్యాం ఎస్ఈ నీలకంఠరెడ్డి

బొమ్మనహాళ్: సరిహద్దులోని హెచ్చెల్సీ 105వ కిలోమీటర్ వద్ద నీటి గేజ్‌ను తుంగభద్ర జలాశయం ఎస్ఈ నీలకంఠరెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. డ్యాం నుంచి బొమ్మనహాళ్ ఆంధ్రా సరిహద్దు వరకు హెచ్చెల్సీ స్థితిగతులపై ఆయన ఆరా తీశారు. హెచ్చెల్సీలో నీటి లభ్యతపై అక్కడున్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ నీలకంఠరెడ్డి మాట్లాడుతూ 19వ క్రస్ట్ గేట్ తెగిపోయి నీరు వృథా అయినప్పటికీ తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో ఆశించని స్థాయిలో వరద రావడంతో డ్యామ్ నిండుకుండలా ఉందని తెలిపారు. ఆయకట్టుకు సాగు నీరు, ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఢోకా లేదన్నారు. ప్రస్తుతం సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,798 క్యూసెక్కుల నీరు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డ్యాం డీఈ సమీద, జేఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్ఎల్ఎన్ తొలిబ్యాచ్ శిక్షణ



శిక్షణ పొందుతున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఒకటి, రెండు తరగతుల పిల్లలందరికీ కనీసం చదవడం, రాయడం సంపూర్ణంగా రావాలనే ఉద్దేశంతో ఆయా తరగతులు బోధించే టీచర్లకు తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో బోధనాపద్ధతులపై ప్రత్యేక శిక్షణ (జ్ఞానప్రకాష్ 60 రోజుల కార్యక్రమం)కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరుతో ఇస్తున్న ఈ శిక్షణ తొలిబ్యాచ్‌కు శనివారంతో ముగిసింది. ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులపాటు శిక్షణ సాగుతుంది. జిల్లాస్థాయి శిక్షణ బుక్కరాయసముద్రం సమీపంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో ఈ నెల 21న ప్రారంభమై శనివారం ముగిసింది. అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు జిల్లా నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఒక్కో జిల్లా నుంచి 125 మంది చొప్పున మొత్తం 250 మంది హాజరయ్యారు. పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో సాగిన ఈ శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్రశిక్ష అధికారులు చర్యలు తీసుకున్నారు. నవంబర్ నాలుగో తేదీ నుంచి రెండో బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమవుతుందని సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శిక్షణ నిర్వహణలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో అనంతపురం నిలిచిందన్నారు.

నకిలీ పట్టాలతో మోసం

- డబ్బు తిరిగివ్వాలని కోరితే దౌర్జన్యం, దాడులు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన 'ఉప్పరపల్లి' బాధితులు



తమకు ఇచ్చిన నకిలీ ఇంటి పట్టాలను విలేకరులకు చూపుతున్న ఉప్పరపల్లి ప్రాంత బాధితులు

అనంతపురం: ఉప్పరపల్లి సమీపంలో బోగస్ ఇంటి పట్టాలు అంటగట్టి మోసం చేసిన వ్యక్తులు.. తమకు డబ్బు వాపస్ ఇస్తామని పిలిచి పథకం ప్రకారం దాడులు చేశారని జనచైతన్య కాలనీకి చెందిన కూలీలు షేక్షావలి, శివకుమార్, మహబూబ్‌బాషా ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని శనివారం జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం, చామలూరు రామాంజనేయులు, ఈడిగ వెంకటేష్ అనే వ్యక్తులు తమతో సహా 198 మంది పేదల వద్ద రూ.5వేల చొప్పున వసూలు చేసి 2018లో ఉప్పరపల్లి వద్ద స్థలాలు కేటాయించి, తహసీల్దార్ అన్వర్‌హుస్సేన్ సంతకంతో కూడిన జిరాక్స్ ఇంటి పట్టాలు అందజేశారన్నారు. ఒరిజినల్ పట్టాలు కావాలంటే రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. తాము జిరాక్స్ పట్టాలు తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీస్తే అధికారులు పరిశీలించి.. ఫోర్జరీ సంతకంతో కూడిన పట్టాలని, ఇవి చెల్లవని తేల్చారన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు ఆర్డీఓ, డీఎస్పీకి ఫిర్యాదు చేశారన్నారు. ఇటీవల అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తాము ఫిర్యాదు చేశామన్నారు. నాగభూషణం అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం తమకు ఫోన్ చేసి డబ్బు తిరిగిచ్చేస్తాం, టీవీ టవర్ వద్దకు రండి అని చెప్పాడన్నారు. దీంతో తాము ముగ్గురూ వారు చెప్పిన చోటుకు వెళితే 'మాపైనే కేసులు పెడతారా' అంటూ నాగభూణం, ఈడిగ వెంకటేశ్, చామలూరు రామాంజనేయులుతో పాటు మరో 30 మంది మహిళలు, 20 మంది పురుషులతో మూకుమ్మడిగా రాళ్లతో దాడి చేశారని తెలిపారు. దాడిలో గాయపడిన తాము ఆస్పత్రికి వెళ్తుండగా 'మాపై కేసులు పెడితే.. మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు పెడతామ'ని బెదిరించారని చెప్పారు. తమను మోసం చేసి.. పథకం ప్రకారం పిలిపించి దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బాధితులు డి.సాంబశివ, జి.రాధ, పి.మద్దిలేటి, ఎస్.నాజియ, ఎస్.జ్యోతి, పి.సువర్ణ, ఎస్.షంషీద్, ఎస్.రిజ్వాన్, జి.శ్రీజ, ఎస్.బాషా తదితరులతో కలిసి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పరిటాల సిద్ధార్థ్ పేరుతో బెదిరింపులు





మాకు ఉప్పరపల్లి వద్ద 198 ఇంటిపట్టాలు ఇచ్చారు. అవి నకిలీ అని, తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని తెలిసింది. దీంతో వారిపైన అధికారులు కేసు పెట్టారు. ఇది తెలిసి మాపై సదరు వ్యక్తులు భౌతికదాడికి దిగారు. డబ్బులు ఇచ్చి కూడా మేము వారితో దెబ్బలు తినాల్సి వచ్చింది. 'మా వెనుక పరిటాల సిద్ధార్థ ఉన్నాడు. మమ్మల్ని ఏమీ చేసుకోలేరు' అని ధీమాగా బెదిరిస్తున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.5 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేశారు. వారు స్థలాలు కేటాయించిన చోట వర్షపునీరు వచ్చి చేరింది. నీరు రాకుండా రిటైనింగ్‌వాల్ కట్టేందుకు మరింత డబ్బులు ఇవ్వాలని నాగభూషణం, రామాంజనేయులు, వెంకటేశ్ అడిగారు. వారి మోసాన్ని పసిగట్టినందుకు మాపై ఎదురుదాడికి దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

–రమేష్, షేక్షావలి, బాధితులు

వజ్రకరూరులో విషాదం

- పది రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు మృతి



మృతి చెందిన వేములనాయుడు

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరులో విషాదం చోటు చేసుకుంది. పది రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు మృతి చెందడం అందరినీ కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 13న వజ్రకరూరుకు చెందిన వేములనాయుడు(39), కుమారుడు సురేంద్ర(13)తో కలిసి ద్విచక్ర వాహనంపై గుంతకల్లు నుంచి ఇంటికి వస్తుండగా కమలపాడు వద్ద కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన తండ్రీకొడుకును ప్రైవేట్ వాహనంలో గుంతకల్లు ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. ఈ నెల 17న కుమారుడు వేముల సురేంద్ర చనిపోయాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వేముల నాయుడు శనివారం సాయంత్రం మృతి చెందాడు. భార్య పూర్ణిమ భర్త మృతదేహంపై పడి 'దేవుడా ఎందుకు ఇంత పనిచేశావు' అంటూ గుండెలవిసేలా పూర్ణిమ రోదించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

తాడిపత్రి రూరల్: చిన్నపొలమడ వద్ద గల ఆర్డీఓ కార్యాలయం సమీపంలోని సపోట తోటలో శనివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అరెస్టయిన వారిలో సజ్జలదిన్నె గ్రామానికి చెందిన మంజుల చౌడయ్య, వెంకటరెడ్డిపల్లికి చెందిన శివారెడ్డి, తాడిపత్రి గణేష్ నగర్‌కు చెందిన రమేష్, నందలపాడుకు చెందిన చంద్రహాస్, పడమటిగేరికి చెందిన బాబాపీరా ఉన్నారు. వీరి నుంచి రూ.44,600 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

వైఎస్ కుటుంబంపై బాబు వ్యాఖ్యలు అనైతికం

- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ధ్వజం



ఉరవకొండ: వైఎస్ జగన్– షర్మిల ఆస్తి పంపకాలు వారి వ్యక్తిగతమని, అయితే వైఎస్ కుటుంబాన్ని లక్ష్యం చేసుకుని చంద్రబాబు వ్యాఖ్యలు, రాజకీయాలు చేయడం అనైతికమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి కుటుంబంలోనూ ఆస్తి పంపకాలు, తగాదాలు ఉంటాయని, ఇందులో వేలు పెట్టి రాజకీయాలు చేయడానికి చంద్రబాబు సిద్ధపడటం సిగ్గుచేటన్నారు. ఎన్నికల హామీలు నేటికీ నెరవేర్చకుండా వైఎస్ కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకోవడం కచ్చితంగా డైవర్షన్ పాలిటిక్స్ చేయడమేనన్నారు. హెరిటేజ్ కంపెనీలో మీ తోబుట్టువుకు ఎంత వాటా ఇచ్చారో సమాధానం చెప్పే దమ్ముందా అని చంద్రబాబును ప్రశ్నించారు. అనవస విషయాలు పక్కనపెట్టి పాలనపై దృష్టి సారిస్తే బాగుంటుందని హితవు పలికారు.

ప్రాణం తీసిన ఓవర్‌టేక్

- ఆటోను ఢీకొన్న కారు
- మహిళా కూలీ దుర్మరణం
- డ్రైవర్ సహా 15 మంది కూలీలకు గాయాలు



దస్తగిరమ్మ (ఫైల్)



గాయపడిన శివ, నబీరసూల్

యాడికి: వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని వ్యవసాయ కూలీలు. శనివారం కూలి పని ముగించుకుని ఆటోలో బయల్దేరిన వారిని వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక కూలీ దుర్మరణం చెందగా.. మరో 15 మంది గాయపడ్డారు. ముందు వెళ్తున్న వాహనాన్ని కారు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాడికి మండలం వేములపాడు కొట్టాలపల్లికి చెందిన గొల్ల శివకు చెందిన ఆటోలో గ్రామానికి చెందిన 16 మంది వ్యవసాయ కూలీలు శనివారం వేకువజామునే పెద్దపప్పూరు మండలం యంగంపేటకు చెందిన ఓ రైతుకు వేరుశనగ పంటను తొలగించేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పని ముగించుకుని ఆటోలో తిరుగుపయనమయ్యారు. వేములపల్లి సమీపంలోకి చేరుకోగానే గుత్తి నుంచి తాడిపత్రి వైపు పోతున్న ఏపీ02ఏకే 3132 నంబరు గల కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా కూలీలతో వస్తున్న ఆటోను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయ్యింది. అందులో ఉన్న వారంతా సమీపంలోని పొలాల్లోకి ఎగిరిపడ్డారు. డ్రైవర్ శివతో పాటు కూలీలు చిన్న రంగారెడ్డి, నబీరసూల్, ప్రతాప్, కుళ్లాయప్ప, కుళ్లాయమ్మ, ఖాశీంబీ, దస్తగిరమ్మ (50), ప్రతాప్, సుబ్బయ్య, రమణమ్మ, రంగమ్మ, రామచంద్రుడు, లక్ష్మి, కళావతి, పాండు భార్య లక్ష్మి, పాండు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ ఈరన్న 108 వాహనాల ద్వారా క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన ఇద్దరికి వైద్యులు స్థానికంగా చికిత్సనందిస్తూ.. మిగిలిన 14 మందిని అనంతపురం ఆస్పత్రికి పంపించారు. చికిత్స పొందుతూ దస్తగిరమ్మ (50) మృతి చెందింది. ఈమెకు భర్త, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన వారిలో ఆటో డ్రైవర్ శివతో పాటు నబీరసూల్, ప్రతాప్, కళావతి, చిన్న రంగారెడ్డి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ప్రమాదంలో ఒకేసారి 15 మంది గాయపడటం, ఒకరు మృతి చెందడంతో వేములపాడు కొట్టాలపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

డ్రిప్ పరికరాల సరఫరా వేగవంతం

- కంపెనీ డీసీఓలకు ఏపీఎంఐపీ పీడీ, ఏపీడీ ఆదేశం



డీసీఓలతో సమావేశమైన ఏపీఎంఐపీ పీడీ, ఏపీడీ

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్ పరికరాల సరఫరా వేగవంతం చేయాలని కంపెనీ ప్రతినిధులను ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్ ఆదేశించారు. శనివారం నగరంలోని ఏపీఎంఐపీ కార్యాలయంలో సూక్ష్మసాగు పథకం పురోగతిపై కంపెనీ డీసీఓలతో సమీక్ష నిర్వహించారు. పీడీ, ఏపీడీ మాట్లాడుతూ జిల్లాకు ఈ ఏడాది అత్యధికంగా 42,100 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు ఇవ్వాలని లక్ష్యం కేటాయించారన్నారు. ఇందుకు అనుగుణంగా ఆర్ఎస్‌కేల్లో 38,514 మంది రైతులు 54,41 హెక్టార్లకు పరికరాలు కావాలని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు మంజూరు, పంపిణీ ప్రక్రియ జరుగుతోందన్నారు. అయితే కొన్ని కంపెనీల నుంచి సహకారం తక్కువగా ఉన్నందున పరికరాల సరఫరా, ఇన్‌స్టలేషన్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,930 మంది రైతుల కోసం 2,278 హెక్టార్లకు డ్రిప్ యూనిట్లు మంజూరు చేశామన్నారు. అందులో 501 హెక్టార్లకు మాత్రమే పరికరాలు సరఫరా చేశారని, ఇక నుంచి అన్ని కంపెనీలు లక్ష్యం మేరకు సరఫరాను వేగవంతం చేయాలని ఆదేశించారు. మరో పక్క సీనియార్టీ వారీగా క్షేత్రస్థాయి పరిశీలన, బీటక్యూ, బీఎంసీ, డిజిటల్ విధానంలో రైతుల వాటా చెల్లింపు లాంటి ప్రక్రియ కూడా వేగవంతం చేశామని తెలిపారు.

డిసెంబర్ ఆఖరుకు పనులు పూర్తి చేయాలి

ఆత్మకూరు: ఉపాధి హామీ పథకం కింద తలుపూరు, వడ్డుపల్లి, ఆత్మకూరులో జరుగుతున్న పనులను డ్వామా పీడీ సలీమ్‌బాషా శనివారం పరిశీలించారు. డిసెంబర్ ఆఖరు నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులు నాణ్యతగా ఉండాలని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పనుల్లో భాగంగా మామిడి మొక్కలను నాటారు. అనంతరం ఎంపీడీఓ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ మండలంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీలకు రూ.2.5 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.2.5 కోట్ల ఉపాధి నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు.

కుష్టు రోగులకు వికలాంగుల పింఛన్

అనంతపురం మెడికల్: కుష్టు వ్యాధితో స్పర్శ కోల్పోయి వైకల్యం బారిన పడిన వారు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే రూ.6వేల పింఛన్ వస్తుందని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమజేమ్స్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులకు పెన్షన్ గురించి తెలియజేయాలన్నారు. వైకల్యం ఉన్న వారికి శస్త్రచికిత్సల ద్వారా నయం చేయడం జరుగుతుందని, ప్రతి ప్రాథమిక కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని సూచించారు. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల పరిధిలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో భాగంగా సర్వే చేపట్టాలని, కేసును ప్రారంభ దశలోనే గుర్తిస్తే వైకల్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. సమావేశంలో ఆ విభాగం వైద్యులు డాక్టర్ గంగాధర్ రెడ్డి, పారా మెడికల్ అధికారి నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, పారామెడికల్ అధికారులు, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక బస్సు ఢీకొని ఒకరి మృతి

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో మాతృశ్రీ ఆస్పత్రి సమీపంలో శనివారం నడుచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని అనంతపురం వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు.

31వేల ఇంకుడు గుంతలు మంజూరు

అనంతపురం టౌన్: వర్షం నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలుగా మార్చేందుకు ఉపాధి హామీ పథకం కింద వ్యక్తిగత ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా తెలిపారు. అనంతపురం జిల్లాకు 31వేల ఇంకుడు గుంతలు మంజూరయ్యాయన్నారు. ప్రతి మండలానికీ వెయ్యికి తగ్గకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఒక్కో ఇంకుడు గుంతకు కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు మంజూరు చేస్తోందన్నారు. మొదటి విడతలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఇంకుడు గుంతలు తవ్వనున్నట్లు వెల్లడించారు. రెండో విడతలో వ్యక్తిగత నివాస గృహాల వద్ద, వర్షపు నీరు ప్రవహించే మార్గంలో ఇంకుడు గుంతలు తవ్వేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీడీలు, ఏపీఓలకు ఆదేశాలను జారీ చేసినట్లు తెలిపారు. ఇంకుడు గుంతలు తవ్వేందకు రూ.18.6కోట్ల మేర కేంద్ర ప్రభుత్వ నిధులను ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంధన సర్దుబాటు అమానుషం



రాంభూపాల్

అనంతపురం అర్బన్: ఇంధన సర్దుబాటు పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపడం అమానుషమని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఏపీ రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు నియంత్రిస్తామని, బిల్లుల భారం తగ్గిస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన టీడీపీ ఇప్పుడు మాటతప్పి అమాంతం 44 శాతం పెంపుదలకు పూనుకోవడం దారుణమన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లోని దురాగ్మర్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైందన్నారు. 2022–23లో వాడిన విద్యుత్‌కు ఈ నవంబరు నెల నుంచి 2026 జనవరి వరకు కొన్ని నెలల్లో యూనిట్‌కు దాదాపు 83 పైసల వరకు అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వుల సారాంశమన్నారు. ఇది విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా పేదలకు పెనుభారమన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనలు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

అనంతపురం టౌన్: శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాయక్ ఇటివల చెన్నైలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో సబ్ రిజిస్ట్రార్ల సంఘం నాయకుడు షామీర్ నేతృత్వంలో ఉమ్మడి జిల్లా సబ్ రిజిస్ట్రార్లు తోటి సబ్‌రిజిస్ట్రార్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. వారంతా రూ.3లక్షల ఆర్థికసాయాన్ని శనివారం అనంతపురంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ విజయలక్ష్మి, డీఆర్ భార్గవ్ చేతుల మీదుగా మృతుని భార్య సుజాతకు అందించారు. త్వరలో సుజాతకు కారుణ్య నియామకం కింద రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగం కల్పించనున్నట్లు రిజిస్ట్రార్ల సంఘం జిల్లా నాయకుడు షామీర్ తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు రమణరావు, శ్రీరాములు, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో మేలైన దిగుబడులు సాధించాలి



ఫాంలో సాగు చేసిన వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కణేకల్లు: వరిలో మేలైన దిగుబడులు సాధించేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం కణేకల్లు అగ్రికల్చర్ ఫాంలో సాగు చేసిన వరి పంటను ఆమె పరిశీలించారు. పీడీడీఎఫ్, ఎస్ఎస్ఎంఎఫ్ ఫాంలో వరిపంటను పరిశీలించిన డీఏఓ ఎప్పటికప్పుడు తెగుళ్ల నివారణ చర్యలు తీసుకోవాలని, మేలైన దిగుబడులొచ్చేలా చూడాలని ఏడీఏ నారాయణనాయక్, ఎంఈఓ మణికంఠను ఆదేశించారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఫాంలో ప్రయోగాత్మకంగా ఇఫ్కో, కోరమాండల్ కంపెనీలకు చెందిన నానో డీఏపీని వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పీఎం ఫసల్‌బీమా సద్వినియోగం చేసుకోండి

ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన సద్వినియోగం చేసుకోవాలని డీఏఓ ఉమమహేశ్వరమ్మ పేర్కొన్నారు. మాల్యం గ్రామంలో పప్పుశనగ విత్తుతున్న రైతులతో డీఏఓ మాట్లాడారు. అనంతరం సొల్లాపురం రైతుసేవ కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో డీఏఓ మాట్లాడారు. పీఎం ఫసల్ బీమా కింద ఎకరాకు రూ.450 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫసల్‌బీమాకు డిసెంబర్ 15 వరకు గడువున్నట్లు చెప్పారు. జొన్న, తెల్ల కుసుమలు, ధనియాలు లాంటి పంటలు సాగు చేస్తే భూసారం తగ్గకుండా మంచి దిగుబడులొచ్చే అవకాశముందన్నారు. డీఏఓ వెంట రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్‌కుమార్, ఆర్ఎస్‌కే సిబ్బంది ఉన్నారు.

బొమ్మనహాళ్: శనివారం సాయంత్రం ఉద్దేహాళ్ వసాయ సహకార సొసైటీని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎరువులను అందించాలన్నారు. అనంతరం ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధి యోజన సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ సాయికుమార్, సీఈఓ హనుమంతు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కే సిబ్బంది హేతుబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్

- నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి



గార్లదిన్నె రైతు సేవ కేంద్రం

అనంతపురం అగ్రికల్చర్: రైతు సేవ కేంద్రా(ఆర్ఎస్‌కే)ల్లో పనిచేస్తున్న సిబ్బంది హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)కు రాష్ట్ర సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రేషనలైజేషన్ లేదా రీడెప్లాయిమెంట్ (పునర్విభజన) పేరుతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 451 ఆర్ఎస్‌కేలకు ఇపుడు సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ మొదలు పెట్టారు. నెలాఖరులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని శనివారం ఉత్తర్వులు వచ్చినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. జిల్లా వ్యాప్తంగా ఆర్ఎస్‌కేల్లో 126 మంది వీఏఏలు (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్), 175 మంది వీహెచ్ఏలు (విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్), 28 మంది వీఎస్ఏలు(విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్స్), అలాగే 122 మంది ఎంపీఈవోలు (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్) ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తున్నారు. రేషనలైజేషన్ కింద సిబ్బందిని సర్దుబాటు చేసే క్రమంలో 1,000 నుంచి 1,500 ఎకరాలకు ఒకరిని నియమించనున్నారు. అలాగే ఆయా మండలాలు, గ్రామాలు, ఆర్ఎస్‌కేల పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ పంటల విస్తీర్ణంను బట్టి... ఏది ఎక్కువగా ఉంటే ఆ శాఖ సిబ్బందికి మొదట ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఫలానా ఆర్ఎస్‌కే పరిధిలో వ్యవసాయ పంటలు ఎక్కువగా ఉంటే వీఏఏకు అవకాశం కల్పిస్తారు. ఇది వరకు అక్కడ వీహెచ్ఏ, వీఎస్ఏలు ఉంటే వారికి ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల నియామకంతో అధిక సంఖ్యలో చిత్తూరుకు బదిలీ అయిన ఎంపీఈవోలను ఇపుడు జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న 108 మంది ఎంపీఈవోల్లో కొందరు అనంతపురం, మరికొందరు శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయించనున్నారు.

క్లుప్తంగా

సామాజిక సేవ అభినందనీయం



అంధ జంటకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం అర్బన్: సామాజిక సేవలో భాగంగా సాయిట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లో సాయిట్రస్ట్ ఆధ్వర్యంలో అంధ జంట లోకేష్, సునీతకు రూ.25 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక సేవను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా నిస్సహాయులకు తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయిట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్, సభ్యుడు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అనంత వాసికి 'వరల్డ్ బ్యూటీ ఐకాన్ అవార్డ్'



హీరో విశాల్‌తో లక్ష్మీసరితారెడ్డి

అనంతపురం కల్చరల్: వరల్డ్ బ్యూటీ అస్థటిక్ ఐకాన్ అవార్డును నగరానికి చెందిన పొన్నపురెడ్డి లక్ష్మీసరితారెడ్డి అందుకున్నారు. చెన్నై వేదికగా జరిగిన పోటీల్లో ది బెస్ట్ ఎస్థటీషియన్‌గా సరితారెడ్డి ఎంపిక కావడంతో హీరో విశాల్ చేతుల మీదుగా పురస్కారం అందజేశారు.

క్యాట్ ఫలితాల్లో ప్రతిభ



విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు, యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: గత నెలలో జరిగిన క్యాట్ మొదటి లెవెల్ పరీక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు విజయం సాధించారని ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కమ్మ భవన్ సమీపంలోని చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విజయోత్సవ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాట్ మొదటి రౌండ్ పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల నుంచి 4,250 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 1,700 మంది రెండో లెవెల్‌కు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ విశ్వనాథ్, సమీనా ఖాన్, తబస్సుమ్, వెంకటేష్, సతీష్, మురళి, పర్వీన్ భాను, నేత్రావతి, శాంత, శ్రీదేవి, కరీం, కోఆర్డినేటర్స్ రాధాకృష్ణ, తిరుమలేశ, నాగభూషణం, ఇర్షాద్, డీన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుబాబుల హంగామా



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తాగి పడేసిన బీరు సీసాలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో మందుబాబులు యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మండల పరిషత్, తహసీల్దార్, ఎమ్మార్సీ, హౌసింగ్, ఉపాధి కార్యాలయాలు అన్నీ ఒకే చోట ఉన్నాయి. ఈ కార్యాలయాలకు ఒక వైపు గేటు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో ప్రవేశిస్తున్నారు. మద్యం తాగిన అనంతరం ఖాళీ సీసాలను కార్యాలయాల ఆవరణలో పడేసి వెళ్లిపోతున్నారు. ప్రభుత్వ కళాశాల కూడా పక్కనే ఉండటంతో విద్యార్థులు, ఉద్యోగులకు ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పశువులు కూడా కార్యాలయాల్లోకి వస్తున్నాయి.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం



నాగుల కట్ట వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాప్తాడు: పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరమవుతాయని వైద్యాధికారులు శివ కృష్ణ, ఉమామహేశ్వరి, సురేంద్ర, పుష్పలత పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పండమేరు వంక ప్రవహించిన విషయం తెలిసిందే. శనివారం కళాకారుల కాలనీ, దండోరా కాలనీ, బృందావన కాలనీల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు రక్త పరీక్షలు చేసి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నరసింహ, హెల్త్ అసిస్టెంట్ డెవిడ్, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జీరో డోస్ వ్యాక్సిన్ కోసం పసికందులతో వచ్చిన మహిళలు



విరిగిపోయిన వీల్‌చైర్‌లో రోగిని తీసుకెళ్తున్న ఎంఎన్‌ఓ

సర్వజన 'వ్యథ'

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులు, వారి సహాయకులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. తాగునీరు మొదలుకుని రోగులకు కల్పించే మౌలిక సదుపాయాల్లో అడుగడుగునా.. నిర్లక్ష్యం కనిపిస్తోంది. దీంతో రోగులు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గైనిక్ విభాగంలో జీరో డోస్ వ్యాక్సిన్ కోసం బాలింతలు పడిగాపులు కాస్తున్నారు. పుట్టిన పిల్లలకు గతంలో వార్డుకే వెళ్లి వ్యాక్సిన్ అందించే పరిస్థితి ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో పసికందులను తీసుకుని వృద్ధులు, మహిళలు గైనిక్ విభాగానికి వస్తున్నారు. ఇక్కడ కూర్చోవడానికి బల్లలు లేకపోవడంతో పిల్లలను ఎత్తుకుని కిందే కూర్చోవాల్సి వస్తోంది. ఇక తాగునీటి కోసం బాలింతలు వార్డు నుంచి ఆర్థో వార్డుకు వెళ్తున్నారు. వార్డుల్లో ఉన్న వాటర్ ప్లాంట్లు మరమ్మతుకు నోచుకోకపోవడంతో బయట తెచ్చుకోవాల్సి దుస్థితి నెలకొంది. మంత్రి సత్యకుమార్ ఇలాకాలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే ఇక మిగతా ప్రాంతాల్లో చెప్పాల్సిన పని లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



భుజంపై చిన్నారిని కూర్చోబెట్టుకుని వాటర్ బాటిల్ తీసుకెళ్తున్న వృద్ధురాలు



వార్డులో నీరు లేకపోవడంతో తెచ్చుకునేందుకు వెళ్తున్న బాలింతలు

సర్టిఫికెట్ల జారీకి పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం సర్టిఫికెట్ల జారీకి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాధిపతులతో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సర్టిఫికెట్ల జారీకి సంబంధించి ప్రతి మంగళ, శనివారం ప్రత్యేకంగా ఒక రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్టాఫ్‌నర్సుల ఆధ్వర్యంలో స్క్రీనింగ్ నిర్వహిస్తారని, మధ్యాహ్నం 2 గంటల నుంచి నాలుగు గంటల మధ్యలో స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణలో సర్టిఫికెట్లు జారీ చేస్తారని వెల్లడించారు. ఇందులో భాగంగా ఓపీడీ కౌంటర్ వద్ద ఒక రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికల్ విభాగం ఆధ్వర్యంలో థలసీమియా, మేజర్, సికిల్‌సెల్, అనీమియా, సివియర్ హీమోఫీలియా ఈ వ్యాధులకు జనరల్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు వ్యాధికి సంబంధించి సర్వజనాస్పత్రిలో వైద్యులు నిర్ధారించిన నివేదికలను తీసుకురావాలన్నారు. పెరాలసిస్ వ్యాధితో బాధపడుతూ చక్రాల కుర్చీకి, మంచానికి పరిమితమైన, తీవ్రమైన కండరాల బలహీనత, వెన్నెముక బాధితులు చక్రాల కుర్చీకి లేదా మంచానికి పరిమితమైన వారికి, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఎముకల విభాగం వారితో ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు 85 శాతం పైబడిన సదరం సర్టిఫికెట్ కల్గి ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. దీర్ఘకాలిక మూత్రపిండా వ్యాధితో బాధపడుతూ, మూడు, నాలుగు ఐదు దశల వ్యాధిగ్రస్తులకు సంబంధించి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ధ్రువీకరించిన రక్త పరీక్షలు, స్కానింగ్ పరీక్ష నివేదికలను తీసుకురావాలన్నారు. మూత్రపిండాలు, కాలేయం, గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేసుకున్న వారు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన రిపోర్టు తేవాలన్నారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, హెచ్ఓడీలు డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ ఆత్మరాం, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం నిర్లక్ష్యం..

- రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం కోల్పోయిన విద్యార్థిని

అనంతపురం ఎడ్యుకేషన్: ఖాదర్‌పేట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి నిర్లక్ష్యం కారణంగా పదో తరగతి విద్యార్థిని, బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కోల్పోయిందని ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు వాపోయారు. వివరాలను శనివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.కేశవమూర్తి, కె.శ్రీనివాసులు, సునీత, రాష్ట్ర నాయకులు నరసింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, అంజినేయులు వెల్లడించారు. విద్యార్థిని కె.కీర్తి ఈనెల 21న అనంతపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన బాస్కెట్‌బాల్ అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైంది. జిల్లా జట్టు శనివారం నుంచి మూడు రోజుల పాటు పశ్చిమ గోదావరి జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కీర్తి తల్లిదండ్రులు అంగీకారం తెలిపారు. అయితే పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అనుమతి ఇవ్వకపోవడంతో పోటీల్లో పాల్గొనే అవకాశం కోల్పోయింది. ఇప్పుడున్న నేషనల్ స్పోర్ట్స్ పాలసీ ప్రకారం స్పోర్ట్స్ కోటాలో రెండు శాతం రిజర్వేషన్ ఉంటుంది. పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినా హెచ్‌ఎం అలసత్వంతో దూరమైంది. ఈ విషయంపై ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని నాయకులు తెలిపారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం అర్బన్: నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాఫర్‌తో పాటు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి హాజరై మాట్లాడారు. కూటమి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలను కేంద్ర ప్రభుత్వం విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపుతోందన్నారు. ధరలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చే నిధులు, పార్లమెంట్ స్థానాల కోసం జనాభా పెంచుకోవాలని కోరడం హాస్యాస్పదమన్నారు. పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5 లక్షలతో పక్కాగా గృహం నిర్మించాలన్నారు. హామీల అమలు కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబరు 18న సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో నాయకులు సంగప్ప, బండారు శివ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటాలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం అర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలను ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి అన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయం నగర అధ్యక్షుడు చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన నగర సమితి సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయన్నారు. కార్మికులకు నష్టదాయకంగా ఉన్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు సరెండర్ లీవ్‌లు, డీఏ, ఏపీజీఎల్ఐ బాండ్ల బకాయిలు విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీ ప్రకటించాలని సూచించారు. ఆప్కాస్ రద్దు చేసి పాత పద్ధతిలో దళారుల వ్యవస్థను తెచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు శ్రీనివాసులు, శివకృష్ణ, అక్బర్ వలి, నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొడిమిలో టీడీపీ కార్యకర్తల విధ్వంసం



రచ్చబండను ధ్వంసం చేసిన దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామంలో కొందరు టీడీపీ కార్యకర్తలు ఏళ్ల నాటి రచ్చబండను ధ్వంసం చేసి రచ్చరచ్చ చేశారు. గ్రామం నడిబొడ్డున రచ్చబండ ఉండేది. మధ్యలో చెట్టు ఉండి కూర్చుని ప్రశాంతంగా గడిపేందుకు అనువుగా ఉండేది. యువకులు, వృద్ధులు మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఇక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. ఈ రచ్చబండ కట్ట దెబ్బతినడంతో రెండేళ్ల కిందట గ్రామస్తులు చందాలు వేసుకుని మరమ్మతులు చేయించారు. ఆ సమయంలో కొందరు టీడీపీ కార్యకర్తలు జోక్యం చేసుకుని మా ప్రభుత్వం వస్తే రచ్చబండను తొలిగిస్తామంటూ హెచ్చరించారు. ఇప్పుడు అనుకున్నట్లే చేశారు. రెండు రోజుల కిందట సాయంత్రం చీకటి పడిన తర్వాత కొందరు టీడీపీ కార్యకర్తలు దగ్గరుండి రచ్చబండ కట్టపై ఉండే బండలను తొలిగించారంటూ గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు. గ్రామకంఠానికి చెందిన స్థలంలో ఇలాంటి చర్యలకు పాల్పడినా అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు పంచాయతీ అధికారులు గాని నోరుమెదపకుండా ఉండటం విశేషం. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఇలాంటి చర్యలను కట్టడి చేయాని గ్రామస్తులు కోరుతున్నారు.

'పాలసీ చేయిస్తేనే మార్కులు వేస్తా'

- ఐటీఐ ఫిట్టర్ విభాగంలో ఓ టీచర్ నిర్వాకం



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: తల్లిదండ్రులతో ఎల్ఐసీ పాలసీలు చేయిస్తేనే మార్కులు వేస్తానంటూ స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ టీచర్ వేధిస్తున్నారంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఐటీఐలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు గణేశు, సోము మాట్లాడారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఫిట్టర్ కోర్స్ బాధ్యత చూస్తున్న టీచర్ ఈశ్వరయ్య మార్కుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. హాజరుశాతం తక్కువ ఉందంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈయన ఎల్ఐసీ ఏజెంటు అవతారం ఎత్తి, పాలసీలు చేయిస్తేనే మార్కులు వేస్తానంటూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులతో పాలసీలు కట్టించాలంటూ ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఈశ్వరయ్యను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరు, సాయి, విజయ్, రాజేష్, స్వామి, ధనుంజయ పాల్గొన్నారు.

'ఎస్వీ'లో రాష్ట్రస్థాయి కామర్స్, మేనేజ్‌మెంట్ ఫెస్ట్



మాట్లాడుతున్న ఎస్వీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం వాణిజ్యోత్సవ్-2కే24లో భాగంగా రాష్ట్ర స్థాయి కామర్స్, మేనేజ్‌మెంట్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాలను అందించడంలో, నూతన ఆవిష్కరణల సాధనలో వాణిజ్యం ప్రాముఖ్యతను తెలియజేశారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ.. ఈరోజు మన ఆర్థిక దృశ్యాన్ని రూపొందించే, ఉద్యోగాలను సృష్టించే, వినూత్న ఉత్పత్తులు, సేవలకు జీవం పోసే వ్యక్తులు, సంస్థలను గౌరవించాలన్నారు. విశ్రాంత వాణిజ్య ఆచార్యుడు డాక్టర్ ఏవీ రమణ మాట్లాడుతూ.. నిర్వహణ అనేది ఏదైనా సంస్థ హృదయ స్పందన. లక్ష్యాలు, విలువలు, వ్యూహాలు అంకితమైన, ఆలోచనాత్మకమైన నిర్వహణ ద్వారా మాత్రమే జీవం పోస్తాయని తెలిపారు. వ్యవస్థాపకత, స్టార్టప్స్, నూతన ఆవిష్కరణల విశిష్టతను సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.మాలతి వివరించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ఏవీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, కన్వీనర్ డాక్టర్ టి.వినయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాంపస్‌లో అధ్వానంగా మరుగుదొడ్లు

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు పేర్కొన్నారు. రూసా పథకం నుంచి నిధులు వెచ్చించి మరుగుదొడ్ల మరమ్మత్తులు చేయించాలని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు శనివారం వినతిపత్రం అందజేశారు. మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళా ప్రొఫెసర్లు, విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు చిగండి రమేష్, సురేష్ బి, భరత్ యాదవ్, రాము, సురేష్ కుమ్మర, హరి పాల్గొన్నారు.

మట్కా బీటర్లపై కేసు నమోదు

అనంతపురం: నగరంలో శనివారం ఎస్ఐ వి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు దాడి చేశారు. మట్కా బీటర్లు వేణుగోపాల్ (రుద్రంపేట), చెన్నంకి మల్లికార్జున (కాట్నేకాలువ) నుంచి రూ.50,200 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సాయినాథ్ తెలిపారు.

జెర్సీల వితరణ

అనంతపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి అన్నారు. శనివారం జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ జట్టుకు క్రికెట్ సామగ్రి, జెర్సీలు వితరణ చేశారు.

'పొదుపు డబ్బు స్వాహా వాస్తవమే'

అనంతపురం కార్పొరేషన్: రజక్‌నగర్‌లోని సుబ్రహ్మణ్యం మహిళా సంఘంలో డబ్బు స్వాహా అయిన మాట వాస్తవమేనని మెప్మా అధికారులు నిర్ధారించారు. ఈనెల 21న సాక్షి దినపత్రికలో సంఘం 'పొదుపు డబ్బు స్వాహా' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై మెప్మా విభాగం సిటీ మిషన్ మేనేజర్ శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు. 2012లో శ్రీ సుబ్రహ్మణ్యం స్వయం సహాయక సంఘం ఏర్పాటైందని పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్ 12న ఆడిట్ చేయించిన తర్వాత రూ.79,758 వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అందుకు ఆర్‌పీ పద్మ, సంఘం సభ్యులు బాధ్యత వహించాలని తెలియజేశామన్నారు. అందులో భాగంగా ఆర్‌పీ పద్మ రూ.54,000 చెల్లించిందని, సంఘం లీడర్లు మీనాక్షి, మహాలక్ష్మి మిగతా మొత్తం చెల్లించాల్సి ఉందని వెల్లడించారు.

కడప రిమ్స్‌కు ఆరుగురి తరలింపు

అనంతపురం మెడికల్: మానసిక సమస్యతో బాధపడుతూ రోడ్డుపై తిరుగుతున్న ఆరుగురిని కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు మనోబంధు ప్రాంతీయ కో-ఆర్డినేటర్ డాక్టర్ ముచ్చుకోట సురేష్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాయదుర్గంలో ఇద్దరు, అనంతపురంలో ఇద్దరు, ఆత్మకూరులో ఒకరు, కళ్యాణదుర్గంలో ఒకరిని రిమ్స్‌కు తరలించడం జరిగిందన్నారు. మానసిక రుగ్మతతో బాధపడుతూ ఆదరించే వారు ఎవరూ లేక, వీధుల్లో తిరిగే వారికి వైద్య సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. అలాంటి వారిని తిరిగి కుటుంబ సభ్యులతో కలిపేందుకు మనో బంధు సంస్థ కృషి చేస్తుందని వెల్లడించారు. మానసిక రుగ్మతతో బాధపడుతున్న వారు ఉంటే 9440931839, 9989988912 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు షఫివుల్లా, అజయ్, దీపక్, నాగేంద్రను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వ్యవసాయశాఖ ఏడీ చెంగల్రాయుడు, వీఆర్వో రామాంజనేయులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్, చెస్ విజేత ఆర్ట్స్ కళాశాల

అనంతపురం: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శనివారం ఎస్కేయూ అంతర కళాశాల క్రీడాటోర్నీలో భాగంగా గ్రూప్-ఏ పోటీలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించారు. గ్రూప్-ఏ పోటీల్లో వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్‌బాల్, యోగా క్రీడాంశాలలో పోటీలు జరగనున్నాయి. చెస్ విన్నర్స్‌గా అనంతపురం ఆర్ట్స్ కళాశాల, రన్నర్స్‌గా ఎస్కే యూనివర్సిటీ, సాఫ్ట్‌బాల్ విన్నర్స్‌గా అనంతపురం ఆర్ట్స్ కళాశాల, సాఫ్ట్‌బాల్ రన్నర్స్‌గా ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, టేబుల్ టెన్నిస్ విన్నర్స్‌గా ఎస్టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల, టేబుల్ టెన్నిస్ రన్నర్స్‌గా ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నిలిచాయి. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ బి. జెస్సీ, ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎల్‌సీ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: హెచ్ఎల్‌సీ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ కోరారు. శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో సీపీఎం ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లను అమర్చేందుదుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరపాలన్నారు. 6,300 క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని కోరారు. పంట కాలువల నిర్మాణం చేపటి, భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు అందించాలని తెలిపారు. అలాగే యాడికి కాలువ నిర్మాణం పూర్తి చేసి నీరు ఇవ్వాలన్నారు. సుబ్బరాయ సాగర్ రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా చెరువులు నింపాలన్నారు. చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రణాళిక రూపొందించి నిధులు కేటాయించాలన్నారు. త్వరలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిని కలిసి బడ్జెట్ ప్రతిపాదనలో సాగు నీటికి నిధులు కేటాయించాలని కోరుతామని వెల్లడించారు. కార్యక్రమంలో రాంభూపాల్, ఎస్ఎం బాషా, చంద్రశేఖర్, సత్యబోస్, భానుజ, రంగారెడ్డి, అబ్దుల్ రసూల్, అమర్‌నాథ్ రెడ్డి, గోవింద రాజులు, శ్రీనివాస రావు, భోగేశ్వర్ రెడ్డి, రాహుల్, తిరుపాలు, ప్రభాకర్ రెడ్డి, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.